క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ఖానాపురం : యువత, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పుల్యాల కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చొరవ

వర్ధన్నపేట: ప్రమాదాల నివారణకు పోలీసులు చొరవ చూపారు. ప్రమాదం జరిగిన చోట రోడ్డు చదును చేయించి, ముళ్లచెట్ల తొలగించారు. వివరాలిలా.. మండలంలోని బండౌతాపురం గ్రామం వెళ్లే రోడ్డు మూలమలుపు వద్ద ఇటీవల ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా 9 మంది గాయాలపాలయ్యారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలిని శుక్రవారం సందర్శించి పరిశీలించారు. రోడ్డు ఇరుకుగా, గుంతలమయమై ఉండడమే ప్రమాదానికి కారణమని గుర్తించి నివారణకు చొరవ చూపారు. మూలమలుపు వద్ద ఉన్న గుంతలను జేసీబీతో చదును చేయించి రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న ముళ్లచెట్ల కొమ్మలను కూడా తొలగింపజేశారు. తద్వారా ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. పనులను సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బంది పర్యవేక్షించారు.

పల్లెల్లో సీఆర్పీల సర్వే

పర్వతగిరి: బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించేందుకు సీఆర్పీలు పల్లెల్లో చేపట్టిన సర్వే శుక్రవారం కొనసాగింది. మండలంలోని పెద్ద తండా, పర్వతగిరిలో సీఆర్పీలు ప్రవీణ్, శ్రీనివాస్ సర్వే చేపట్టి పాఠశాలలకు వెళ్లని విద్యార్థులను గుర్తించారు. వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో చేర్పించారు. అన్ని గ్రామాల్లో సర్వే చేసి బడికి వెళ్లని బాలలను గుర్తించి లక్ష్యాన్ని చేరుకుంటామని సీఆర్పీలు తెలిపారు.

ఇద్దరు కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్

దుగ్గొండి: మండలంలోని ఇద్దరు నాయకులను సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు శుక్రవారం తెలిపారు. నాచినపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త పెండ్యాల రాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అండ్రు రత్నాకర్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దొంతి మాధవరెడ్డి గెలుపునకు భంగం కల్పించేలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పెండ్యాల రాజుకు, రత్నాకర్‌రెడ్డికి ఇక నుంచి కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు.

వారి విజ్ఞతకే వదిలేస్తున్నా..

తనను సస్పెండ్ చేయడాన్ని కాంగ్రెస్ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నానని నాచినపల్లి సర్పంచ్ భర్త పెండ్యాల రాజు మీడియాకు తెలిపారు. పార్టీకి, మాధవరెడ్డికి నష్టం కలిగించ లేదని చెప్పారు.

గీత కార్మికుడికి గాయాలు

వర్ధన్నపేట: తాటిచెట్టుపై నుంచి గీత కార్మికుడు తీవ్ర గాయాలపాలైన ఘటన ఘటన మండలంలోని ల్యాబర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం గ్రామంలోని తాటివనంలోకి వెళ్లి కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడిపోగా ఆయనకు గాయాలయ్యాయి. ఆయన్ను వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నివాళి

నర్సంపేట: పట్టణంలోని 24వ వార్డు అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పెరుమాండ్ల రవి తల్లి రాజమ్మ గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, బండి రమేశ్, గుంటి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సంగెం: కుంటపల్లి, మొండ్రాయి, గొల్లపల్లి, ఎల్గూర్ స్టేషన్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబసభ్యులు పలువురు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం పరామర్శించారు.

ఫంక్షన్ హాల్ నిర్మించాలి

చెన్నారావుపేట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ఆవరణలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని కోరుతూ సీఈఓ చిట్టి రవికి రైతులు విజేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, అన్వేశ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కొందరు అఖిలపక్షం పేరుతో సొసైటీ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

కొనసాగిన 'ప్రజా పాలన' సభలు

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో రెండో రోజూ ప్రజా పాలన గ్రామసభలు శుక్రవారం కొనసాగాయి. పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ పెండెం లక్ష్మి రామానంద్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధికారి ప్రవంతి, ఆర్పీ రేణుక, కీసరి వెంకటేశ్వర్లు, కాట రాహుల్, కాట అఖిల్, బోయిని మహేశ్, రంజిత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంగెం: మండలంలోని కొత్తగూడెం, గాంధీనగర్, నర్సానగర్, ఎల్గూర్ స్టేషన్, బీకోజీనాయక్ తండా, వంజరపల్లి, పల్లారుగూడ గ్రామాల్లో సభలు నిర్వహించగా పల్లారుగూడలో డీఆర్డీఓ సంపత్‌రావు హాజరై మాట్లాడారు. ఆహార భద్రత కార్డుల వారీగా ప్రజలందరికి దరఖాస్తు ఫారాలు అందజేస్తామని చెప్పారు. ఎంపీడీఓ రవీందర్ మాట్లాడుతూ నిరక్షరాస్యులు గ్రామ పంచాయతీ వద్ద అధికారులతో ఫారాలు నింపించి గడువులోగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీఓ కొమురయ్య, ఏఓ యాకయ్య పాల్గొన్నారు.

నల్లబెల్లి: మండలంలోని గోవిందాపూర్, ఆసరవెల్లి, ముచ్చింపుల, ముచ్చింపుల తండ, గొల్లపల్లి గ్రామాల్లో సభలు నిర్వహించగా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. గోవిందాపూర్, ఆసరవెల్లి, గొల్లపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మైనాల అశోక్ తదితరులు దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ కూచన ప్రకాశ్, సర్పంచ్‌లు కరివేదుల వెంకట్‌రెడ్డి, రాజు, బొట్ల సువర్ణ, గుగులోత్ రవళిత, దాసి పూలమ్మ, ఎంపీటీసీ అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



సంగెం : మాట్లాడుతున్న డీఆర్డీఓ సంపత్‌రావు

నెక్కొండ: మండలంలోని మూడు తండా, మహబూబ్‌నాయక్ తండా, మడిపల్లి, పిట్టకాలుబోడు తండా, గొల్లపల్లి, వెంకట్ తండా గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్లు రాజ్‌కుమార్, పర్వీన్‌కౌసర్, నాగరాజు, జానకీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండలంలోని తురకలసోమారం, గుగులోతుతండా, తూర్పుతండా, గోరుగుట్టతండా, అనంతారం, గోపనపల్లి, బూర్గుమళ్ల, మంగ్యతండాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గోపనపల్లిలో తహసీల్దార్ వెంకటస్వామి, తురుకల సోమారంలో ఎంపీడీఓ చక్రాల సంతోశ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. గోపనపల్లిలో దరఖాస్తులు నింపేందుకు ప్రైవేటు వ్యక్తులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసుకున్నారు.

చెన్నారావుపేట: మండలంలోని ఖాదర్‌పేట, పాపయ్యపేట, జీడిగడ్డ తండా, గొల్లపల్లి గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కృష్ణవేణి మాట్లాడారు. ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాలో మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట : దరఖాస్తులు స్వీకరిస్తున్న కౌన్సిలర్

దుగ్గొండి: మండలంలోని శివాజీనగర్, పీజీతండా, గుడిమహేశ్వరం, గుడ్డెలుగులపల్లి, స్వామిరావుపల్లి, నారాయణతండా, దేశాయిపల్లి, రేబల్లెల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించగా మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఎంపీఓ శ్రీధర్ గౌడ్, ఏఓ దయాకర్ దరఖాస్తులు స్వీకరించారు. పీజీతండాకు చెందిన కొందరు గత ప్రభుత్వంలో తమకు ఇండ్లు మంజూరు కాగా పనులు ప్రారంభించామని, వాటినే కొనసాగించాలని అధికారులకు విన్నవించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

నాలుగు చోట్ల దరఖాస్తుల స్వీకరణ

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలో ధర్మారంలోనే దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారని, శనివారం నుంచి మిగతా ప్రాంతాల్లోనూ స్వీకరిస్తారని కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ తెలిపారు. కీర్తినగర్ బొడ్రాయి, గరీబ్‌నగర్ కమ్యూనిటీ హాల్, జాన్‌పాక వార్డు ఆఫీసు వద్ద అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు.

ముగిసిన పుష్కర కుంభాభిషేకం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: నర్సంపేటలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో 23వ మండల పూజా మహోత్సవం, ద్వితీయ పుష్కర కుంభాభిషేకం ముగింపు సందర్భంగా శుక్రవారం వేద పండితులు సి.వెంకటేశ్ శర్మ గురుస్వామి నేతృత్వంలో విజయవాడ వాస్తవ్యులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామి నవచండీ హోమం, సహస్ర కలశాభిషేకం శుక్రవారం నిర్వహించారు. నర్సంపేట, పరకాల ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొనగా చైర్మన్ మాధవ శంకర్‌గుప్తా, కమిటీ సభ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రథమ కళశాన్ని తీసుకొచ్చి ఆలయం అర్చకులతోపాటు, తుని శ్రీపీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి, బ్రహ్మశ్రీ వెంకటేష్‌శర్మతోపాటు అర్చకుల మంత్రోచ్చరణ నడుమ అయ్యప్పస్వామి ఆలయం పైన కళశంతో అభిషేకం నిర్వహించారు. వంగేటి గోవర్ధన్ పద్మ, మునగాటి శ్రీకాంత్ దీప, నాగమల్లి రణధీర్ శ్రీదేవి, మచ్చిక మహేశ్ స్రవంతి, శమన్వి, పెద్ది శ్రీధర్ మాధవి, డాక్టర్ దొడ్డ సాయిబాబా, సాయి సుప్రిచిత, సామల చందన్‌బాబు రాధిక, తాటికొండ కిరణ్ లావణ్య, గంధం సుమన్, వేములపల్లి సుబ్బారావు జయశ్రీ, పాలవెల్లి వరుణ్‌కుమార్ కళ్యాణి, నర్సంపేట డివిజన్ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, ఆక్టర్ పి.గోపాల్, డాక్టర్ భారతి, డాక్టర్ కె.రాజేశ్వర్‌రావు, డాక్టర్ ఉజ్వల, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, మల్యాల పోశెట్టి సోమలక్ష్మి, మాదాపూర్ వెంకన్న పావని, రాధాకృష్ణ, గోపికృష్ణ ఇండస్ట్రీస్, దొడ్డ విజయ్‌కుమార్ కవిత అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్ గుప్తా, రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, చింతల కమలాకర్‌రెడ్డి, సర్వేశం, శ్రీరాముల శంకరయ్య, పాలకుర్తి శ్రీనివాస్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

నర్సంపేట నియోజకవర్గ, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ అయ్యప్పస్వామి దీవెనలతో సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణిస్తేనే బంగారు భవిష్యత్

- రిటైర్డ్ ప్రొఫెసర్ డీవీబీఎస్.శర్మ, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి

నర్సంపేట రూరల్ : విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని రిటైర్డ్ ప్రొఫెసర్ డీవీబీఎస్.శర్మ, డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి తెలిపారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్టుకు జిల్లాలోని 14 మండలాలకు చెందిన 109 మంది విద్యార్థులు హాజరు కాగా పరీక్షను శర్మ, కృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు వారు బహుమతులు అందజేశారు. టీఎస్ఎంఎస్ గురుకుల పాఠశాలకు చెందిన వివేక్ మొదటి, అఖిల ద్వితీయ, నెక్కొండ టీఎస్ఆర్ఎస్ గురుకుల పాఠశాల విద్యార్థి అక్షయ తృతీయ బహుమతి అందుకున్నారు. అలాగే జిల్లా పరిషత్ సెంకడరీ పాఠశాలలకు చెందిన ఇంగ్లీష్ మీడియం విభాగంలో వరంగల్ జిల్లా కృష్ణనగర్ కాలనీ జీహెచ్ఎస్ విద్యార్థి సిద్దార్థ మొదటి, సుందరయ్యనగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రహమాన్ ద్వితీయ, నెక్కొండ మండలంలోని సూరిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి యశ్వంత్ తృతీయ బహుమతి అందుకున్నారు. తెలుగు మీడియంలో రాయపర్తి జెడ్పీ హైస్కూల్ స్పందన మొదటి, సంగెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వంశీ ద్వితీయ, ఖానాపురం మండలం మనుబోతులగడ్డ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఆర్.శ్రావణి తృతీయ బహుమతులు గెల్చుకోగా వారికి శర్మ, కృష్ణమూర్తి అందజేసి మాట్లాడారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు జనవరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం కొర్ర సారయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో శర్మ, కృష్ణమూర్తి, తదితరులు

జూడో పోటీల అబ్జర్వర్‌గా వీరస్వామి



వర్ధన్నపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న బొల్లపెల్లి వీరస్వామి రాష్ట్రస్థాయి జూడో పోటీల అబ్జర్వర్‌గా నియమితులైనట్లు ఆ స్కూల్ హెచ్ఎం వేణు తెలిపారు. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ ఆధ్వర్యంలో జనవరి 31 వరకు రాష్ట్రస్థాయి జూడో పోటీలు జరగనుండా శుక్రవారం నుంచి వీరస్వామి జూడో అబ్జర్వర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం పేర్కొన్నారు.

మండల వాసికి రైల్ సేవా పురస్కార్



సంగెం: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన పాక రాజ్‌కుమార్ రైల్ సేవా పురస్కార్ అవార్డును అందుకున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్‌లో గురువారం నిర్వహించిన 68వ రైల్ సేవా పురస్కార్-2023 కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ చేతుల మీదుగా రాజ్‌కుమార్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. అవార్డు తన బాధ్యత మరింత పెంచిందని చెప్పారు.

ఘనంగా రామలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

పర్వతగిరి: మండలంలోని అనంతారం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సర్పంచ్ తౌటి విజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణలతో వేద పండితులు భాస్కరాచారి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. తొలుత ప్రత్యేక హోమాలు, గణపతిపూజ, ప్రాతరోపాసనము, స్థాపిత దేవతాయజనము, మంగళవాయిద్యములచే ఆలయ ప్రవేశం, వాస్తు పర్యగ్నికరణ పీఠ పూజలు, గర్తన్యాసము, నవరత్న న్యాసము వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లూనావత్ కమల పంతులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సర్వర్, పీఏసీఎస్ చైర్మన్లు గొర్రె దేవేందర్, మనోజ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్, నాయకులు బూర శ్యాం, జంగిలి యాకయ్య, బొట్ల మధు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఏకాంతంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ముదిరాజ్ కులస్తుల ఐక్యతే ధ్యేయం

సంగెం: గ్రామీణ ప్రాంతాల్లోని ముదిరాజ్‌లందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే ధ్యేయంగా పల్లెల్లో కార్యక్రమాలు చేపడుతున్నట్లు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు. మండలంలోని ఎల్గూర్ రంగంపేటలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఇతర అన్ని రంగాల్లో రాణించేలా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. అన్ని ముదిరాజ్ కుటుంబాలు ప్రభుత్వ ఉద్యోగం సాధించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కుల ప్రజల అభివృద్ధికి సంఘం సూచనలు, సలహాలు అందిస్తూ అండగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నీరటి రాజు, బోనాల రమేశ్, ఎల్గూర్ రంగంపేట మత్స్య సొసైటీ చైర్మన్, రాష్ట్ర కమిటీ సభ్యులు బోనాల భగత్‌కుమార్, బోనాల రవి, సతీశ్, శంకర్, ఎల్లస్వామి, నర్సయ్య, ప్రశాంత్, సాయిరామ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

గ్రామానికి చేరిన అయోధ్య రామమందిర అక్షింతలు

రాయపర్తి: మండలంలోని మైలారం గ్రామానికి అయోధ్య రామమందిర అక్షింతలను తీసుకొచ్చినట్లు అయ్యప్పస్వాములు తాళ్ల సందీప్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రామాలయంలోకి తీసుకొచ్చిన అక్షింతలను మైలారానికి శుక్రవారం తీసుకెళ్లి రామాలయంలో భద్రపర్చినట్లు తెలిపారు. అక్షింతలను జనవరి 1 నుంచి 15 వరకు గ్రామంలో పంచనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు, గ్రామస్తులు మోహన్‌రెడ్డి, సంపత్, యాకన్న, హరి, శ్రావణ్, శివ, అశోక్, బిక్షపతి, కిరణ్, వీరన్న, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని బోడమాణిక్యతండాకు చెందిన బోడ సురేశ్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా బాధిత కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల పార్టీ సాధారణ సభ్యత్వ బీమా ప్రొసీడింగ్ పత్రాన్నిపట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, బండి రమేశ్, నామాల సత్యనారాయణ, గోనె యువరాజు, తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ప్రజాపాలనలో భాగస్వాములు కావాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చెప్పారు. దరఖాస్తుల విషయంలో గందరగోళం నేపథ్యంలో ప్రజలకు సహకరించాలని సూచించారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ

నెక్కొండ: రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఎస్సారెస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటగిరి నారాయణ కోరారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ స్టేజ్-1 కాల్వ ద్వారా వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని నెక్కొండ, నెల్లికుదురు, కేసముద్రం మండలాల పరిధిలోని రైతులు యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఆయా మండలాల ఆయకట్టుకు యాసంగి కోసం జనవరి 1 నుంచి మార్చి 22 వరకు ఆరుతడి పంటల సాగుకు వారబంది పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులు సహకరించాలని కోరారు. శ్రీరాంసాగర్, లోయర్ మానేరు డ్యామ్, ఇతర రిజర్వాయర్లలో తగిన నీటి లభ్యత లేని కారణంగా కాల్వల ద్వారా చివరి భూములకు సాగునీటిని అందించలేమని చెప్పారు. ఇప్పటికే సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో రైతుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. చివరి భూములకు నీరు ఇచ్చే అవకాశం లేని పరిస్థితుల్లో బావులు, బోరు సదుపాయం ఉంటే మాత్రమే సదరు భూముల్లో ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

- వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

సంగెం: రసాయనాలు వినియోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే మెరుగైన లాభాలు పొందవచ్చని మామునూర్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న తెలిపారు. మండలంలోని దత్తత గ్రామమైన గవిచర్లలో రైతుల పొలం వద్ద బీజామృతం, నీమాస్త్రం, వేప కషాయం తయారు చేసే విధానాన్ని శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి వస్తుందని చెప్పారు. రైతులు ఇళ్లల్లో లభించే ఆవు పేడ, మూత్రం వినియోగిస్తే మొక్కలు సరైన రీతిలో పెరగడంతోపాటు చీడపీడలను తట్టుకునే రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. తద్వారా రసం పీల్చే పురుగులు, ఇతర తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడవచ్చన్నారు. నీమాస్త్రం తయారీకి ఆవుపేడలో 5 కేజీల వేపాకు రసం, 5 లీటర్ల ఆవు మూత్రం కలిపి 48 గంటల మురగబెట్టి వడగట్టి ఎకరా అన్ని రకాల పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రాజు, నెహ్రూయువ కేంద్రం అధ్యక్షుడు రాజు, సురేశ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఆలయ ప్రహరీ పనులు ప్రారంభం

- దాతకు అభినందన

గీసుగొండ: మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన అల్లం బాలకిషోర్‌రెడ్డి సొంత డబ్బుతో ఊకల్ గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి బాలకిషోర్‌రెడ్డి, గ్రామస్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను వైస్ ఎంపీపీ రడం శ్రావ్య, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో భరత్, మాజీ సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ వీరారావు, కక్కెర్ల సుభాశ్, నాగరాజు, మండల నరేశ్, ముదిరాజ్ సంఘం ముఖ్యనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న బాలకిషోర్‌రెడ్డి, గ్రామస్తులు

ఎస్సీ హాస్టల్ ప్రహరీ కూల్చివేత

నెక్కొండ: మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ ప్రహరీని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్ల క్రితం మూసేశారు. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల హాస్టల్ ప్రహరీని కూల్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రహరీ కూల్చివేతకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకుని భవనాన్ని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

నెక్కొండ: ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగు దొరికిన క్రమంలో బాధితురాలికి రైల్వే కాంట్రాక్ట్ స్వీపర్ గురువారం రాత్రి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. రైల్వే టికెట్ బుకింగ్ క్లర్క్ భిక్షపతి కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన కామగోని ప్రియరామ గాంధీ ఖమ్మం వెళ్లేందుకు గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. ఆమె స్టేషన్‌లో బ్యాగు మర్చిపోయింది. రాత్రి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్వీపర్ చెరుకు సుజన స్టేషన్ ఊడ్చుతూ బ్యాగ్‌ను గుర్తించి రైల్వే అధికారులకు అప్పగించింది. బ్యాగ్ తనిఖీ చేయగా రూ.30,440 నగదు, ఆధార్, ఇతర కార్డులు లభించాయి. ఆధార్ కార్డుపై ఉన్న మొబైల్ నంబర్ ఆధారంగా బాధితురాలికి సమాచారం అందించారు. ఆమె సూచన మేరకు బ్యాగును బాధితురాలి బంధువుకు అప్పగించారు.



బ్యాగ్ అందజేస్తున్న టికెట్ బుకింగ్ క్లర్క్ భిక్షపతి

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

ఖానాపురం: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని డాక్టర్ రవీందర్ తెలిపారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్కే)లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రవీందర్ మాట్లాడారు. విద్యార్థులు భోజనం చేసే ముందు తప్పకుండా చేతులు శుభ్రం చేసుకోవాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం దివ్య, తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్

చెన్నారావుపేట: వైద్యులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయొద్దని డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది వైద్యసేవల టార్గెట్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు, స్టాఫ్‌నర్స్ స్వరూపరాణి, ఏఎన్ఎం సుధ, తదితరులు పాల్గొన్నారు.